తెలంగాణ

TELANGANA MUCHATLU

# ముచ్చట్లు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | ఆదివారం - 27 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 114 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



- వీరనారికి సీఎం ఘన నివాళులు
- ఆత్మగౌరవ పోరాట యోధురాలి స్మరణ
- అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం
- తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆమెకు ఘన నివాళులు అర్పించారు. దొరల పాలనను ధిక్కరించి, వెట్టి చాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మహనీయురాలిగా చాకలి ఐలమ్మను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ఆమె త్యాగాలు, పోరాట స్ఫూర్తి తెలంగాణ సమాజానికి చిరస్థాయిగా మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అణగారిన వర్గాల హక్కుల కోసం

మిగతా 2 లో..

## పూరిగుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం



- ప్రతి అర్హ కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇల్లు
- మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్ల మంజూరు
- పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయమన్న పొంగులేటి
- జనగామలో 500 మందికి మంజూరు పత్రాల పంపిణీ

**జనగామ, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో పూరిగుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

మిగతా 2 లో..

## ఆమ్రాబాద్‌లో రాత్రి వాహనాల నిషేధం

- వన్యప్రాణుల రక్షణకు కఠిన చర్యలు
- రాత్రి 9 నుంచి ఉదయం 6 వరకు ఆంక్షలు
- అత్యవసర సేవలకు మాత్రమే మినహాయింపు
- వాహనదారులు సహకరించాలని విజ్ఞప్తి



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

వన్యప్రాణుల సంరక్షణతో పాటు రహదారులపై వాహనాల రాకపోకల కారణంగా జంతువులకు ఎదురవుతున్న ప్రమాదాలను నివారించేందుకు

మిగతా 2 లో..




## గ్రామీణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ఉమ్మడి నాలుగు జిల్లాల ప్రాంతీయ సమీక్ష సమావేశం
- గ్రామీణాభివృద్ధి, తాగునీటి పథకాల పురోగతిపై సమీక్ష
- పెండింగ్ భవనాలు, తాగునీటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించిన మంత్రి సీతక్క

**రంగారెడ్డి, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో వేగం పెంచి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలకు సంబంధించిన ప్రాంతీయ సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న

మిగతా 2 లో..

### విద్య, వైద్య రంగాలపై

## ప్రభుత్వంతో పోరాటం చేస్తాం

- ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితిపై తీవ్ర ఆందోళన
- ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తామని వెల్లడి
- ప్రజా సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణకు సిద్ధం



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె పలు అంశాలపై

మిగతా 2 లో..

## ఆయిల్‌పామ్‌కు ప్రాసెసింగ్ విస్తరణ



- మూడేళ్లలో పది లక్షల ఎకరాల లక్ష్యం
- రైతులకు సమీపంలోనే ప్రాసెసింగ్ సదుపాయాలు
- సామర్థ్య పెంపుపై మంత్రి తుమ్మల సమీక్ష

**నర్మెట్ట, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అనుగుణంగా ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని కూడా పెంచాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

మిగతా 2 లో..

## లంచం తీసుకుంటూ సీడీపీవో పట్టివేత

- అవినీతి నిరోధక శాఖ వలలో అధికారి
- రూ.63 వేల లంచం స్వీకరిస్తూ పట్టుబాటు
- అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల పేరుతో డిమాండ్
- జగిత్యాల జిల్లాలో కలకలం



**జగిత్యాల, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

జగిత్యాల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నిర్వహించిన ప్రత్యేక చర్యలో మెట్‌పల్లి శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి దారోజు పద్మ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అధికారిక విధుల్లో

మిగతా 2 లో..



### చాకలి ఐలమ్మ ఆశయాలు

## చిరస్మరణీయం

- మహబూబ్‌నగర్‌లో 131వ జయంతి వేడుకలు
- ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించిన వి. శ్రీనివాస్ గౌడ్
- తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ సేవలు అమోఘం
- మహిళా చైతన్యానికి ప్రతీకగా కొనియాడిన మాజీ మంత్రి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజన వర్గాల స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ ఆశయాలు చిరస్మరణీయమని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లో చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో..

## హైదరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయ హోదాపై అభ్యంతరం

- హోదా తగ్గింపు ప్రతిపాదనను వ్యతిరేకించిన ఒవైసీ
- కేంద్ర మంత్రులకు లేఖ రాసిన హైదరాబాద్ ఎంపీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నగర చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్న హైదరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయ హోదాను తగ్గించాలన్న ప్రతిపాదనపై హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ

మిగతా 2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పూరిగుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం వెనుకడుగు వేయడం లేదన్నారు. పేదల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని పాలన సాగిస్తున్నామని చెప్పారు. పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి విడతల వారీగా ఇళ్లను అందించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. వచ్చే దసరా నాటికి 2.18 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి ప్రతి నియోజకవర్గానికి అదనంగా 2 వేల ఇళ్లు కేటాయించామని చెప్పారు. పూరిళ్లలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. జనగామ నియోజకవర్గంలో గుర్తించిన 500 పూరిళ్ల కుటుంబాలకు ఈ వేదికపైనే రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లు, మొండిగోడలతో ఉన్న ఇళ్లను పూర్తి చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇప్పటికే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త తెల్ల రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు హాస్టళ్లలో డైట్ ఛార్జీలను 40 శాతం పెంచడంతో పాటు ఇతర సౌకర్యాలను కూడా విస్తరించామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాల సమీకృత విద్యాసంస్థలను నిర్మిస్తున్నామని వెల్లడించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు ఇప్పటివరకు రూ.70 వేల కోట్లకు పైగా వడ్డీలేని రుణాలు అందించామని మంత్రి పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు రైతు భరోసా పథకం కొనసాగుతోందని, వరి సాగు చేసిన రైతులకు మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయగా, మరో 14 నుంచి 15 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు. జనగామ మున్సిపాలిటీ అభివృద్ధికి తొలి విడతగా రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పూర్తికాని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నివాసయోగ్యంగా మార్చి అర్హులైన లబ్ధిదారులకు దసరా నాటికి అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఏ అర్హ కుటుంబం కూడా ఇందిరమ్మ ఇల్లు విషయంలో నిరాశ చెందాల్సిన అవసరం లేదని, మూడో, నాలుగో విడతల్లో కూడా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# గ్రామీణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని మంత్రి సమీక్షించారు. జిల్లాల వారీగా జరుగుతున్న పనుల స్థితిగతులను తెలుసుకుని పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపడుతున్న రహదారి నిర్మాణ పనులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించిన మంత్రి, పనుల నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుదలకోసం రహదారుల నిర్మాణం కీలకమని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులు, తాగునీటి సమస్యలు, వ్యవసాయ రంగంపై ప్రభావం వంటి అంశాలను ముందుగానే అంచనా వేసి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామ పంచాయతీ భవనాలు, గ్రామీణ సంఘాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ పనులను వేగవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామీణ తాగునీటి సరఫరా పథకాల అమలుపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామానికి నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు.

# విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వంతో పోరాటం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

విస్తృతంగా మాట్లాడారు. ఆరోగ్యం, విద్య వంటి మౌలిక రంగాలపై ప్రభుత్వం తగినంత శ్రద్ధ చూపడం లేదని ఆరోపిస్తూ, ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యం తగదన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, వసతి గృహాల పరిస్థితిని తక్షణమే మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రిలో ఇటీవల జరిగిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కవిత, చిన్నారుల మరణాలకు సంబంధించిన గణాంకాలు కలచివేశాయని అన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం శిశు మరణాల సంఖ్య ఆందోళన కలిగించే స్థాయిలో ఉందని పేర్కొన్నారు. ప్రజారోగ్య వ్యవస్థలో లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య రంగానికి తగిన నిధులు కేటాయించడంతో పాటు కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రంలోని పలు ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల కొరత, వైద్యుల కొరత, సిబ్బంది సమస్యలు కొనసాగుతున్నాయని కవిత పేర్కొన్నారు. కొన్ని ఆస్పత్రుల్లో రోగుల సంఖ్యకు తగిన సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వైద్య సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆరోగ్యశ్రీ వంటి పథకాల అమలులో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ భూములు పొందిన ప్రైవేట్ ఆస్పత్రులు నిర్దిష్ట శాతం ఉచిత వైద్యం అందించే విధంగా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. విద్యా రంగంపై కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని అన్నారు. ముఖ్యంగా బాలికల కోసం మరుగుదొడ్లు, పరిశుభ్రత సదుపాయాలు, శానిటరీ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలు తగిన స్థాయిలో లేవని పేర్కొన్నారు. పాఠశాలలు, వసతి గృహాల పరిస్థితిని జిల్లా అధికారులు తరచూ పరిశీలించాలని, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యా నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, వసతి గృహాల పరిస్థితిపై తమ పార్టీ ప్రత్యేక పరిశీలన కార్యక్రమాన్ని చేపడుతుందని కవిత ప్రకటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లాల వారీగా పర్యటించి సమస్యలను నమోదు చేస్తారని తెలిపారు. ప్రజలు, యువత కూడా తమ ప్రాంతాల్లోని ప్రభుత్వ సంస్థల పరిస్థితులను పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే విద్య, వైద్య రంగాల్లో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. రాజకీయ అంశాలపై మాట్లాడుతూ ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిని బరిలోకి దింపుతామని కవిత వెల్లడించారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలనే ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకు సాగుతామని చెప్పారు. సాగునీరు, తాగునీరు, గిరిజన సంక్షేమం, ప్రజారోగ్యం, విద్య వంటి అంశాలపై కూడా త్వరలో ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై మరింత దృష్టి సారించాలని, ప్రజల సంక్షేమమే పరిపాలనకు కేంద్రబిందువుగా ఉండాలని కవిత పేర్కొన్నారు.

# లంచం తీసుకుంటూ సీడీపీవో పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

అనుకూలత చూపేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.63 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ అధికారులు శనివారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. అవినీతి నిరోధక శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణ మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల సమయంలో ప్రతికూల వ్యాఖ్యలు నమోదు చేయకుండా ఉండేందుకు అధికారి అక్రమంగా డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మొత్తం 21 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి నెలకు వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేయాలని కోరినట్లు అధికారులు తెలిపారు. మూడు నెలల కాలానికి సంబంధించి మొత్తం రూ.63 వేలుగా లంచం నిర్ణయించినట్లు వెల్లడించారు. ఫిర్యాదు అందుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు ప్రత్యేకంగా వల పన్ని చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కార్యాలయ ఆవరణ వెలుపల ఫిర్యాదుదారుడి నుంచి రూ.63 వేల లంచం స్వీకరిస్తుండగా అధికారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమె వద్ద నుంచి లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజాసేవలో ఉన్న అధికారులు తమ అధికారాలను దుర్వినియోగం చేసి అక్రమ ప్రయోజనాలు పొందడం చట్టవిరుద్ధమని అవినీతి నిరోధక శాఖ పేర్కొంది. విధి నిర్వహణలో అనుకూలత చూపేందుకు లంచం డిమాండ్ చేయడం, స్వీకరించడం అవినీతి నిరోధక చట్టాల కింద నేరమని స్పష్టం చేసింది. ఈ ఘటనపై మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. పట్టుబడిన అధికారిని అరెస్టు చేసి కరీంనగర్‌లోని ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసుకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు వెంటనే అవినీతి నిరోధక శాఖ ఉచిత సహాయ సంఖ్య 1064కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ఫిర్యాదు చేసిన వారి పేరు, వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా కూడా అవినీతి నిరోధక శాఖను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# ఆయిల్‌పామ్‌కు ప్రాసెసింగ్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

నాగేశ్వరరావు అన్నారు. రానున్న మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పది లక్షల ఎకరాలకు చేర్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలోని ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతితో కలిసి సందర్శించిన మంత్రి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాసెసింగ్ కేంద్రంలో పండ్ల గుత్తుల సేకరణ, రవాణా, ప్రాసెసింగ్ విధానం, నీటి లభ్యత, నిర్వహణ వ్యవస్థ, రైతులకు అందుతున్న సేవలపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు డెబ్బై వేల మెట్రిక్ టన్నులకు పైగా పండ్ల గుత్తులను ప్రాసెస్ చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం గంటకు ముప్పై టన్నుల సామర్థ్యంతో కేంద్రం పనిచేస్తోందని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా దీన్ని మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతున్నకొద్దీ పండ్ల ఉత్పత్తి కూడా భారీగా పెరుగుతుందని, అందువల్ల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచడం అత్యవసరమని మంత్రి పేర్కొన్నారు. నర్మెట్ట కేంద్రాన్ని భవిష్యత్‌లో గంటకు నూట ఇరవై టన్నుల సామర్థ్యానికి విస్తరించే అవకాశాలు ఉండటం సానుకూల పరిణామమన్నారు. రైతులు పండించిన పంటను సకాలంలో ప్రాసెస్ చేయగలిగితే నాణ్యతతో పాటు ఆదాయం కూడా పెరుగుతుందని వివరించారు. రైతులు తమ పంటను దూర ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం లేకుండా సమీప ప్రాంతాల్లోనే ప్రాసెసింగ్ కేంద్రాలు అందుబాటులో ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. కోత అనంతరం వీలైనంత త్వరగా ప్రాసెసింగ్ జరిగితే పంట నాణ్యత కాపాడబడుతుందని, రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. సాగు విస్తరణకు అనుగుణంగా ప్రాసెసింగ్ కేంద్రాలు, రవాణా సదుపాయాలు, ఇతర మౌలిక వసతులను ప్రభుత్వం దశలవారీగా పెంచుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ రైతులతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు. పంట దిగుబడులు, సాగు విధానాలు, కోతలు, రవాణా, ప్రాసెసింగ్ అంశాలపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. శాస్త్రీయ పద్ధతులు, సరైన నీటి యాజమాన్యం, సమయానుకూలంగా కోతలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను మంత్రికి వివరించగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రాసెసింగ్ కేంద్రానికి అవసరమైన నీటి లభ్యతపై కూడా మంత్రి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. వర్షపాతం తక్కువగా ఉన్న పరిస్థితుల్లో కేంద్రానికి నీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన నీటిని సమీప జలాశయాల నుంచి అందుబాటులోకి తీసుకువచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన పంటను సకాలంలో సేకరించి ఎలాంటి జాప్యం లేకుండా ప్రాసెస్ చేసే విధంగా సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఆయిల్‌పామ్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయాలు చిరస్మరణీయం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల కోసం ఆమె చూపిన ధైర్యసాహసాలు నేటి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. నిజాం పాలనలో సామాన్య ప్రజల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలక అధ్యాయమన్నారు. అన్యాయాలకు ఎదురొడ్డి నిలిచి మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిన గొప్ప నాయకురాలిగా ఆమెను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సాధికారత, సామాజిక సమానత్వం, స్వాభిమాన పోరాటాలకు చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆమె ఆశయాలను యువత అధ్యయనం చేసి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తెలంగాణ సమాజ నిర్మాణంలో ఆమె పాత్ర విశిష్టమని అన్నారు. చాకలి ఐలమ్మ జీవితం పోరాటస్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనమని, బహుజన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆమె చూపిన మార్గం నేటికీ ఆదర్శప్రాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల ప్రతినిధులు, అభిమానులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె సేవలను స్మరించుకుంటూ పలువురు నాయకులు ప్రసంగించారు.

# హైదరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయ హోదాపై అభ్యంతరం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత మంత్రులకు లేఖ రాశారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ సంస్థ హోదాను తగ్గించడం నగర వారసత్వానికి నష్టం కలిగించే చర్యగా ఆయన అభివర్ణించారు. హైదరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న ఉన్నత స్థాయి నుంచి దిగువ స్థాయికి మార్చి, నగర తపాలా విభాగంలో విలీనం చేయాలన్న ప్రతిపాదన ఇటీవల వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఒవైసీ స్పందించారు. ఈ నిర్ణయం తీసుకునే ముందు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న సంస్థ విషయంలో ఏకపక్ష నిర్ణయాలు సరైనవి కావని తన లేఖలో వివరించారు.
హైదరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయం రాష్ట్రంలో అత్యంత రద్దీగా పనిచేసే తపాలా కేంద్రాల్లో ఒకటిగా కొనసాగుతోందని ఒవైసీ గుర్తు చేశారు. నగర పరిధిలోని భారీ స్థాయిలో ఉత్తరాలు, పార్శిళ్లు, ఇతర తపాలా సేవలు ఈ కార్యాలయం ద్వారా నిర్వహించబడుతున్నాయని తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న సేవల అవసరాలను దృష్టిలో ఉంచుకుంటే ఈ కార్యాలయ ప్రాముఖ్యత మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో తపాలా బిళ్లల సేకరణ, తపాలా చరిత్ర పరిరక్షణకు సంబంధించిన ప్రత్యేక కేంద్రం కూడా ఇక్కడే పనిచేస్తోందని ఒవైసీ వివరించారు. తపాలా వ్యవస్థ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇలాంటి ప్రత్యేకతలు కలిగిన సంస్థ హోదాను తగ్గించడం సమంజసం కాదని, దాని స్వతంత్ర గుర్తింపును కాపాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.
హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని లక్షలాది మంది ప్రజలకు ఈ కార్యాలయం సేవలు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. తపాలా సేవలతో పాటు వివిధ ప్రభుత్వ, ఆర్థిక, ప్రజా సేవలకు కూడా ఈ కార్యాలయం కేంద్ర బిందువుగా ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంస్థ పనితీరును మరింత బలోపేతం చేయాల్సి ఉండగా, హోదా తగ్గింపు వంటి చర్యలు తీసుకోవడం సరికాదని అన్నారు. ప్రజా ప్రయోజనాలు, చారిత్రక వారసత్వం, సంస్థ ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను పునఃసమీక్షించాలని ఒవైసీ కోరారు. హోదా తగ్గింపు, విలీనం ప్రతిపాదనలను పూర్తిగా రద్దు చేసి, హైదరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయాన్ని స్వతంత్ర హోదాతో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, ప్రజలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

(మొదటి పేజీ తరువాయి)

చాకలి ఐలమ్మ నిర్భయంగా పోరాడారని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం ఆమె సాగించిన ఉద్యమం తెలంగాణ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిందని తెలిపారు. సామాన్య ప్రజల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగాలు నేటి తరానికి కూడా స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ పోరాటం కేవలం వ్యక్తిగత హక్కుల కోసం సాగిన ఉద్యమం కాదని, అది సామాజిక న్యాయం కోసం జరిగిన ప్రజా పోరాటమని ముఖ్యమంత్రి వివరించారు. సామాజిక వివక్ష, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యసాహసాలు ప్రజల్లో చైతన్యం నింపాయని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె పాత్ర చారిత్రాత్మకమని గుర్తు చేశారు. దోపిడీ శక్తులకు ఎదురొడ్డి నిలిచిన చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని ముఖ్యమంత్రి కొనియాడారు. మహిళల సాధికారత, సామాజిక సమానత్వం, న్యాయం కోసం ఆమె చూపిన మార్గం నేటికీ ప్రాసంగికంగానే ఉందన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం సమాజం బాధ్యత అని పేర్కొన్నారు.

# ఆమ్రాబాద్‌లో రాత్రి వాహనాల నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో రాత్రివేళ వాహనాల రాకపోకలపై అటవీ శాఖ కఠిన ఆంక్షలు అమలు చేయాలని నిర్ణయించింది. టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో వన్యప్రాణుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.టైగర్ రిజర్వ్‌లలోని కోర్ ప్రాంతాలు, క్రిటికల్ టైగర్ హ్యాబిటాట్ ప్రాంతాల మీదుగా వెళ్లే రహదారులపై రాత్రి సమయంలో వాహనాల రాకపోకలను నియంత్రించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం వరకు అత్యవసర సేవలకు సంబంధించిన వాహనాలను మినహాయించి ఇతర వాహనాలను అనుమతించవద్దని స్పష్టం చేసింది. ఈ ఆదేశాల అమలులో భాగంగా ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అటవీ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు సాధారణ వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదు. ఈ సమయంలో అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, ఇతర అత్యవసర విధుల్లో ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి కల్పించనున్నారు. మిగిలిన వాహనాలను రిజర్వ్ అటవీ ప్రాంతాల్లోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు.రాత్రివేళల్లో రహదారులపై సంచరించే పులులు, చిరుతలు, జింకలు, అడవి పందులు తదితర వన్యప్రాణులు వాహనాల ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అటవీ అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వన్యప్రాణుల సహజ జీవనానికి ఆటంకం కలగకుండా రాత్రి వేళల్లో వాహనాల నియంత్రణ అవసరమైందన్నారు. పర్యావరణ సమతుల్యత పరిరక్షణకు ఈ నిర్ణయం దోహదపడుతుందని తెలిపారు.ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్ దేశంలోని ముఖ్యమైన పులుల ఆవాస ప్రాంతాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇక్కడ పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, అరుదైన పక్షులు, అనేక జాతుల వన్యప్రాణులు నివసిస్తున్నాయి. వీటి సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## చాకలి ఐలమ్మకు ఘన నివాళి



- బహుజనుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- ఆమె ధైర్యసాహసాలు తెలంగాణ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిదాయకం: మేయర్

**కరీంనగర్, సెప్టెంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం వీరోచితంగా పోరాడిన వీరనారి చిట్యాల ఐలమ్మ 131వ జయంతి వేడుకలు కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన అధికారిక కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై చింతకుంటతో పాటు ప్రతిమ మల్టీప్లెక్స్ చౌరస్తా వద్ద ఉన్న ఐలమ్మ విగ్రహాలకు రజక సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశత్వం, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీరవనిత చిట్యాల ఐలమ్మ అని అన్నారు. కౌలు భూమి కోసం దొరల గూండాలను ఎదిరించి ఆమె చూపిన తెగువ, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని బహుజన, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, పాలకవర్గ సభ్యులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, రజక సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీక



- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి,సెప్టెంబర్26(తెలంగాణ ముచ్చట్లు):** అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి వీరనారి చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా వనపర్తి బస్టాండ్ సమీపంలోని ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..భూమి, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం నాటి అణచివేతకు ఎదురొడ్డి నిలిచిన చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం సమాజంలో చైతన్యాన్ని నింపిందని తెలిపారు.అన్యాయాన్ని ప్రశ్నించి, ఆత్మగౌరవం కోసం ధైర్యంగా నిలబడిన ఐలమ్మ జీవితం నేటి సమాజానికి గొప్ప సందేశాన్ని అందిస్తోందన్నారు. ముఖ్యంగా మహిళలు తమ హక్కుల కోసం ధైర్యంగా ముందుకు రావడానికి ఆమె పోరాటం స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు.మహిళా శక్తికి, బహుజన చైతన్యానికి, సామాజిక న్యాయ పోరాటానికి చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని తూడి మేఘారెడ్డి కొనియాడారు. ఆమె ఆశయాలను, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం కృషి చేయడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తి చిరస్మరణీయమని, ఆమె పోరాటం తెలంగాణ సమాజానికి ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్, ఉప చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, వనపర్తి మండల అధ్యక్షుడు రవికిరణ్, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, నాయకులు జీజే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

- పలుస శంకర్ గౌడ్,జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు



**వనపర్తి,సెప్టెంబర్26(తెలంగాణ ముచ్చట్లు):** భూస్వాముల దౌర్జన్యాలకు ఎదురొడ్డి భూమి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అన్నారు. వనపర్తిలో చాకలి ఐలమ్మ 131వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవం కోసం, సామాజిక న్యాయం కోసం ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆమె తెగువ, త్యాగం, ధైర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. స్త్రీ శక్తికి, ఆత్మగౌరవానికి చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని అన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో యువతకు ఐలమ్మ పోరాట స్ఫూర్తిని తెలియజేసే కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 'జోహార్ చాకలి ఐలమ్మ' అంటూ నినాదాలు చేశారు.కార్యక్రమంలో జైభీం సేవా సంఘం అధ్యక్షులు బండారు శ్రీనివాస్, గంధం నాగరాజు, భారత రాష్ట్ర సమితి నాయకుడు పరంజ్యోతి, యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షులు మధు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## 250 వారాలుగా నిరంతర అన్నదానం.. మతీన్ & ఫ్రెండ్స్ ట్రస్ట్ సేవాభావం

- పేదలు, కూలీలు, చిరు వ్యాపారులకు ఆపన్నహస్తం
- ఐదేళ్లుగా ప్రతి శనివారం కొనసాగుతున్న ఉచిత భోజన సేవ
- ట్రస్ట్ సభ్యుల సేవా స్ఫూర్తిని అభినందించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**కరీంనగర్, సెప్టెంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు ):** జిల్లా కేంద్రంలోని శనివారం మార్కెట్‌లో మతీన్ & ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 250 వారాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక అన్నదాన కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

దాదాపు ఐదేళ్లుగా ప్రతి శనివారం ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమం పేద ప్రజలు, చిరు వ్యాపారులు, రైతులు, కూలీలకు ఆకలి తీర్చే ఆపన్నహస్తంగా నిలిచిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 250 వారాలుగా వేలాది మందికి ఉచితంగా భోజనం అందించడం అభినందనీయమన్నారు.

అన్నదానం అన్ని దానాల్లోకెల్లా ఉత్తమమైనదని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం గొప్ప సేవ అని డా. కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఇంతకాలం నిరంతరాయంగా కార్యక్రమాన్ని నిర్వహించడం సులభమైన విషయం కాదని, మతీన్ & ఫ్రెండ్స్ ట్రస్ట్ సభ్యుల సేవా స్ఫూర్తిని అభినందించారు. ఇలాంటి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని మరింత పెంపొందిస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపార సంఘాల నాయకులు, స్వచ్ఛంద సేవకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 250 వారాల మైలురాయిని పురస్కరించుకుని ప్రత్యేకంగా పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. భవిష్యత్తులోనూ ఈ సేవా కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు.

## స్టేషన్ ఘనపూర్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



- రజక సంఘం, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఘన నివాళులు

**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు శనివారం స్టేషన్ ఘనపూర్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ పొన్న రవి మాట్లాడుతూ దొరల అహంకారాన్ని ఎదిరించి పేదల భూముల కోసం పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పొన్న రాజేష్, పొన్న బిక్షపతి, సత్యనారాయణ, మధు, మచ్చ బిక్షపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా..

స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ కార్యాలయంలో కూడా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి మేనేజర్ సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ నీల రాజమ్మ, లెక్కల అధికారి నితిన్, పట్టణ ప్రణాళిక అధికారి సాయి, జూనియర్ సహాయకులు సందీప్, శ్రీనివాస్, సుమలత, మంజుల, కౌన్సిలర్లు పొన్న రవి, పొన్న రాజేష్, పొన్నం స్వరూప-రాజయ్య, అంగడి రజిత-కృష్ణ, సహనామినేటెడ్ సభ్యుడు గన్ను నరసింహులు, తిరుమలనాథ దేవస్థాన చైర్మన్ నీల నరసింహులు, గట్టు రమేష్, పెసరు సారయ్య, గుర్రం రమేష్, షేక్ జానీ పాషా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపతిపల్లిలో పేద రైతు పట్టా భూమి ఆక్రమణకు యత్నం

- న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు బాధితుడి వినతి

**చిల్పూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ జిల్లా చిల్పూర్ మండలం శ్రీపతిపల్లి గ్రామంలో పేద యాదవ రైతు పట్టా భూమి ఆక్రమణకు గురవుతోందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామానికి చెందిన నరాల కనుకయ్య తనకు సర్వే నంబర్ 315/ఏలో 35 గుంటల పట్టా భూమి ఉందని, తరతరాలుగా ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు.

అయితే అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ కుల సంఘం పేరుతో పట్టా భూమిలోని రెండు గుంటల స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని కనుకయ్య ఆరోపించారు. ఈ నెల 8న తన పొలంలో ఉన్న గడ్డి కట్టలను బావిలో పడేయడంతో పాటు నీటి పైపులు, షెడ్డును ధ్వంసం చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా పొలానికి వెళ్లే దారిని అడ్డుకుని బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు.తన భూమికి అధికారుల ద్వారా హద్దులు నిర్ణయించి, ఆక్రమణకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరారు. పొలానికి వెళ్లే దారిని పునరుద్ధరించి, తమ కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి విజ్ఞప్తి చేశారు.



## సాయుధ పోరాటంలో ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



- 8వ వార్డు కౌన్సిలర్ పొన్న రాజేష్

**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లు బస్టాండ్ వద్ద చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను 8వ వార్డు కౌన్సిలర్ పొన్న రాజేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పొన్న రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చేసిన పోరాటం, ఆమె చూపిన ధైర్యసాహసాలు చిరస్మరణీయమని అన్నారు. పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పొన్న రవీందర్, పొన్న రాజయ్య, పొన్న యాకయ్య, మచ్చ వెంకటయ్య, లొంక రమేష్, స్థానికులు వడ్లకొండ రాంబాబు, గాండ్ల ధనుజయ, సయ్యద్ సాజిద్, రంగు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.


## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.!



- లబ్ధిదారులకు కార్డులు అందజేసిన ఎమ్మెల్యే మట్టా రాగమయి.

**సత్తుపల్లి, సెప్టెంబరు 26 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలంలోని పాకలగూడెం, నారాయణపురం గ్రామాల్లో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందుతాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకంతో పేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలతో గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి, ముఖ్యంగా మహిళలకు ప్రయోజనం కలుగుతోందని పేర్కొన్నారు. ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, ఎంఆర్ఓ, ఎంపీడీవో, పాకలగూడెం సర్పంచ్ గుంటుపల్లి సునీత కృష్ణ, సత్తుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, నారాయణపురం సర్పంచ్ తెల్లూరి వెంకట్ విజయ్‌లక్ష్మి, ఉపసర్పంచ్ తిరుమలరావు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 28న వనపర్తి జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన



- కొమ్ము వెంకటస్వామి పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు

**వనపర్తి,సెప్టెంబర్26(తెలంగాణ ముచ్చట్లు):**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార-ప్రజా సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 28న వనపర్తి జిల్లాలో పర్యటించనున్నట్లు పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనలో భాగంగా పెద్దమందడి మండలం వెల్టూర్‌లో తెలంగాణ ప్రభుత్వ పాఠశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని ఆయన తెలిపారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి 9.30 గంటలకు వెల్టూర్‌కు చేరుకోనున్న మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అనంతరం వనపర్తి మండలం చిట్యాల గ్రామంలో బాలుర జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు కొమ్ము వెంకటస్వామి తెలిపారు. నూతన పాఠశాల, జూనియర్ కళాశాల భవనాల నిర్మాణంతో ఆయా ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు.మంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని కొమ్ము వెంకటస్వామి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపిన విద్యార్థులు



- **సమాజ సేవలో ఆదర్శంగా నిలిచిన పాఠశాల విద్యార్థులు**

**వనపర్తి,సెప్టెంబర్26(తెలంగాణ ముచ్చట్లు):** దివ్యాంగుల కోసం విరాళాలు సేకరించి వారికి అండగా నిలిచిన వనపర్తి జిల్లా కేంద్రంలోని రేడియంట్ ఉన్నత పాఠశాల, తిరుమల హిల్స్ విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, పర వస్తు సొసైటీ రాష్ట్ర సమన్వయకర్త గద్దె భాస్కర్ అన్నారు.శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ జేబు ఖర్చులతో పాటు ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించి దివ్యాంగులకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు మొత్తం రూ.16 వేల విరాళాలను సేకరించారని తెలిపారు.సమాజ సేవకు ముందుకొచ్చిన విద్యార్థులందరినీ వారు మనస్పూర్తిగా అభినందించారు. విద్యార్థులు పుస్తక పాఠాలకే పరిమితం కాకుండా మానవత్వం, సేవా భావాన్ని అలవరచుకోవడం ఆదర్శనీయమన్నారు. ఇతరులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. మానవ సేవే మాధవ సేవ అనే భావనతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.అనంతరం విరాళాలు అందించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కౌసల్య భాస్కర్, ప్రధానోపాధ్యాయుడు ఉప్పరి తిరుమలేష్, ఉప ప్రధానోపాధ్యాయుడు బి. రాము, పర్యావరణ పరిరక్షణ విభాగం సమన్వయకర్త శృతి, ఉపాధ్యాయులు రాహుల్, శాంతయ్య, శ్రీనివాస్, అఖిల్, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేష్, మల్లేష్, ఖదిరున్నిసా, రామేశ్వరి, గీతా, రజిత, శ్వేత, సరోజ, సాత్విక, జరీనా, తల్లిదండ్రులు, విద్యార్థులు, సాహితీ కళా వేదిక సభ్యులు పాల్గొన్నారు.

# 22/A బాధిత దళిత కుటుంబాలకు బీజేపీ అండ



- **కొండన్నపల్లిలో బాధిత కుటుంబాలకు పరామర్శ**
- **బాధితులకు భరోసా కల్పించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం**

**కరీంనగర్, సెప్టెంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు ):** గంగాధర: చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామంలో 22/A కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న దళిత కుటుంబాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ.. 22/A కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు. వారి న్యాయమైన హక్కుల సాధన కోసం బీజేపీ పోరాడుతుందని భరోసా కల్పించారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ఒక్కసారిగా కూలిన ఇల్లు.. తప్పిన పెను ప్రమాదం



- **భోజనం చేస్తుండగా పైకప్పు కూలి వ్యక్తికి గాయాలు**
- **నిలువ నీడ లేకుండా పోయిందంటున్న బాధిత కుటుంబం**

**చిల్పూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని మల్కాపూర్ గ్రామంలో చెరువు కట్ట కింద పోచమ్మ గుడి సమీపంలో శుక్రవారం రాత్రి ఓ పెంకుటిల్లు ఒక్కసారిగా కూలిపోయింది. గ్రామానికి చెందిన తమ్మ రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తుండగా ఇంటి పైకప్పు నుంచి మట్టి ఊడిపడింది. ఈ ఘటనలో రమేష్‌కు గాయాలయ్యాయి. పైకప్పు కూలిన సమయంలో రమేష్ భార్య, కుమారుడు, కుమార్తె, అత్తమ్మ అక్కడే ఉన్నప్పటికీ అదృష్టవశాత్తు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఒక్కసారిగా ఇల్లు కూలిపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.
నిలువ నీడ లేకుండా పోయింది
ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఇల్లు పూర్తిగా దెబ్బతిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఇల్లు కూలిపోవడంతో తమకు నిలువ నీడ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఆర్థిక సాయం అందించి ఇల్లు నిర్మించుకునేలా సహకరించాలని వేడుకున్నారు.

# గొర్రెలు, మేకల పెంపకందారులకు అండగా ప్రజా ప్రభుత్వం

- **బీమా, మెరుగైన మార్కెటింగ్, పశువైద్య సేవలకు ప్రాధాన్యం : మంత్రి పొన్నం ప్రభాకర్**



**కరీంనగర్, సెప్టెంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు ):**కరీంనగర్ ఇందిరాభవన్‌లో నిర్వహించిన జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం తొలి మహాసభలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. కులవృత్తులకు అండగా ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని, గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు.
పెంపకందారులకు బీమా సౌకర్యం, మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు, పశువైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కులవృత్తిదారులకు 50 ఏళ్లకే పెన్షన్ అందించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకానికి ప్రభుత్వ భూములను వినియోగించే అంశాన్ని పరిశీలించాలని కోరినట్లు చెప్పారు.
మన పిల్లల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని, ప్రతి కుటుంబం తమ పిల్లలను బాగా చదివించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.
ఈ మహాసభలో ఎమ్మెల్యేలు డా. కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సహచర మంత్రి వాకిటి శ్రీహరి, కార్పొరేషన్ చైర్మన్లు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సరితా తిరుపతయ్య యాదవ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చరణ్ కౌశిక్ యాదవ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, కార్పొరేటర్లు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్ అంబేద్కర్ బస్‌స్టేషన్‌లో మహనీయుడి విగ్రహావిష్కరణ

- **సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ముందుకు సాగుతాం**
- **ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం**
- **నాడు పేరు పెట్టాం.. నేడు విగ్రహాన్ని ఆవిష్కరించాం మంత్రి పొన్నం ప్రభాకర్**

**కరీంనగర్, సెప్టెంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ పట్టణంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ బస్‌స్టేషన్ ప్రాంగణంలో బాబా సాహెబ్ డా. భీంరావు రాంజీ అంబేద్కర్ విగ్రహాన్ని సహచర మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 2013లో తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా కరీంనగర్ బస్‌స్టేషన్‌కు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టడం జరిగిందని, 13 ఏళ్ల తర్వాత అదే బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ముందుకు సాగుతామని మంత్రి తెలిపారు. చాకలి ఐలమ్మ, జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.
ప్రజాపాలనలో ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సంస్థ పరిరక్షణతో పాటు ప్రయాణికుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. అంబేద్కర్ ఆశయాలను ఆచరించడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డా. కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, కార్పొరేషన్ చైర్మన్లు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సరితా తిరుపతయ్య యాదవ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చరణ్ కౌశిక్ యాదవ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, కార్పొరేటర్లు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రాజవరంలో బీఆర్ఎస్, బీజేపీలకు షాక్



- **కాంగ్రెస్‌లోకి క్యూ కడుతున్న ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు**
- **కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**చిల్పూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన సుమారు 60 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో చేరిక కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిర్ర నాగరాజు, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు చెందిన 30 మంది, బీజేపీ బజరంగ్ దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాయిని అశోక్‌తో పాటు మరో 30 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు చేరుతుండటంతో వివిధ వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు వస్తున్నారని అన్నారు. ఇదే స్ఫూర్తితో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్, రాజవరం గ్రామ శాఖ అధ్యక్షుడు ఎల్లయ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు సూర్యనారాయణ, కర్ణాల యాదగిరి, మోటం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పల్లగుట్ట పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయుడికి వీడ్కోలు

- **సేవలను కొనియాడిన తోటి ఉపాధ్యాయులు**
- **ఓం ప్రకాష్‌ను సన్మానించిన దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి**

**చిల్పూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని పల్లగుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఓం ప్రకాష్ పదవీ విరమణ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఓం ప్రకాష్ ఎన్నో ఏళ్లుగా విద్యార్థులకు ఆంగ్ల భాషపై ఆసక్తి కలిగేలా బోధిస్తూ, ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేశారని కొనియాడారు. ఆయన నిబద్ధత, క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల చూపిన ఆప్యాయత, విద్యాబోధనలో చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు.
పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు కోమలి, పి. శ్యాంసుందర్ రావు, సౌభాగ్యలక్ష్మి, శోభారాణి, అరుణాదేవి, అలకనంద, రమేష్, సురేష్, యాకూబ్ పాషా, రమణ కుమార్, శ్రీకాంత్, నీలిమ, దేవ్ సింగ్ రాథోడ్ తదితరులు ఓం ప్రకాష్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.అనంతరం ఓం ప్రకాష్ మాట్లాడుతూ తన ఉద్యోగ జీవితంలో సహకరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



ఓం ప్రకాష్‌ను సన్మానించిన పొట్లపల్లి శ్రీధర్
వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చిల్పూర్ గుట్ట దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ పదవీ విరమణ పొందుతున్న ఓం ప్రకాష్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని, ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎనగందుల నరసింహారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిర్ర నాగరాజు గౌడ్, దేవస్థాన డైరెక్టర్ రత్నాకర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడాలి

- **-సీపీఎం నాయకుల డిమాండ్**
- **ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్**
- **ఓటు హక్కు, రాజ్యాంగ పరిరక్షణపై ప్రజా ఉద్యమం చేపడతాం**



**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఇప్పగూడెంలో శనివారం నిర్వహించిన సీపీఎం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను బాధ్యతల నుంచి తప్పించాలని రాపర్తి రాజు డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని కాపాడేందుకు ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా కొనసాగుతున్నట్లు భారత ఎన్నికల కమిషన్ అధికారిక వివరాలు వెల్లడిస్తున్నాయి.
'ఓటు హక్కును రక్షించాలి – రాజ్యాంగాన్ని పరిరక్షించాలి' అనే అంశాలపై ప్రజా ఉద్యమం చేపడతామని రాపర్తి రాజు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల వ్యవస్థ స్వతంత్రత, ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.
భారత ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థగా దేశంలో లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసనసభలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలను నిర్వహిస్తుంది.
సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, మండల కార్యదర్శి మునిగెల రమేష్, నాయకులు కుర్ర ఉప్పలయ్య, సిద్ధుల సుదర్శన్, ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దండేపల్లికి వైకుంఠ రథం.. సర్పంచ్ గొలిపెల్లి శారద–సంపత్ దంపతుల ముందడుగు



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి వైకుంఠ రథాన్ని సమకూర్చేందుకు గ్రామ సర్పంచ్ గొలిపెల్లి శారద-సంపత్ దంపతులు ముందడుగు వేశారు. ఇటీవల గ్రామంలో ఓ నిరుపేద కుటుంబ యజమాని మృతిచెందిన సమయంలో వైకుంఠ రథం అందుబాటులో లేక కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటన తమను కలచివేసిందని వారు తెలిపారు.కుటుంబంలో ఒక వ్యక్తిని కోల్పోయిన సమయంలో కలిగే దుఃఖం ఎంతో బాధాకరమని, అలాంటి ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి మానవతా బాధ్యత అని సర్పంచ్ దంపతులు పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో వైకుంఠ రథాన్ని సమకూర్చి, భవిష్యత్తులో ఆపదలో ఉన్న కుటుంబాలకు అవసరమైన సమయంలో సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.వైకుంఠ రథం ఏర్పాటుకు తమ వంతుగా రూ.5,000 విరాళంగా అందిస్తున్నట్లు గొలిపెల్లి శారద-సంపత్ దంపతులు ప్రకటించారు. గ్రామ ప్రజలు కూడా తమకు తోచినంత సహాయం అందించి ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు."మన సహాయం చిన్నదైనా.. ఆపదలో ఉన్న కుటుంబానికి అది ఎంతో పెద్ద అండ" అని వారు పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో దండేపల్లికి వైకుంఠ రథాన్ని సమకూర్చి, అవసరమైన వారికి అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# జమ్మికుంట మార్కెట్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

- **చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం**
- **మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న–సదానందం**



**జమ్మికుంట, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జమ్మికుంట కాటన్ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం, పాలకవర్గ సభ్యుల సమక్షంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం మాట్లాడుతూ.. బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. నాటి దొరల పాలన, వెట్టిచాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా నిలబడి తన భూమి కోసం చేసిన పోరాటం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి గొప్ప స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు.భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ ప్రజల తెగువకు ప్రతీకగా నిలిచిందన్నారు. మహిళలు కూడా అన్యాయాన్ని ఎదిరించి హక్కుల కోసం పోరాడగలరని చాటి చెప్పిన ధీరవనితగా ఆమెను కొనియాడారు. ఐలమ్మ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ఆర్. మల్లేశం, ద్వితీయ శ్రేణి కార్యదర్శి ఎన్. రాజా, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, గౌరవ సభ్యులు శ్రీపతి రెడ్డి, సునీల్, సతీష్, రాజేశ్వరరావు, సదానందం, సురేష్, దీక్షిత్, శ్రీనివాస్ రెడ్డి, రషీద్ పాషా, తిరుపతి, శ్యామ్ కుమార్, శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, అర్తిదారుల సంఘం, హమాలీ, దడువాయి సంఘం అధ్యక్షుడు ఎరబెల్లి రాజేశ్వర్ రావు, మార్కెట్ సిబ్బంది, అర్తి, ఖరీదు వ్యాపారులు, గుమస్తాలు, హమాలీలు, దడువాయి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మహిళా స్ఫూర్తిదాయిని చాకలి ఐలమ్మ

- **వెట్టి చాకిరీ, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా వీరనారి పోరాటం**
- **మహిళల్లో ఆత్మగౌరవం, ధైర్యాన్ని నింపిన ఐలమ్మ: మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని**



**హుజురాబాద్, సెప్టెంబర్ 26: (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ మహిళా స్ఫూర్తిదాయిని, పేదల హక్కుల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్ నిమ్మటూరి సాయికృష్ణ అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని ఏరియా హాస్పిటల్ వద్ద ఉన్న ఐలమ్మ విగ్రహం వద్ద శనివారం వీరనారి చిట్యాల ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణలో సామాజిక అసమానతలు, పెత్తందారీ దోపిడీ, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరనారి అని కొనియాడారు. భూమి, కూలి, ఆత్మగౌరవం కోసం అణగారిన వర్గాల ప్రజలను చైతన్యపరిచిన ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమన్నారు.

అప్పటి సామాజిక పరిస్థితుల్లో మహిళగా అనేక అడ్డంకులను ఎదుర్కొంటూనే అన్యాయానికి తలొగ్గకుండా పోరాటం చేయడం ఆమె ధైర్యసాహసాలకు నిదర్శనమన్నారు. ప్రజలపై పెత్తందారుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఐలమ్మ నిలబడటం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ప్రజల్లో చైతన్యం పెరగడానికి దోహదపడిందన్నారు. తనకు ఎదురైన అన్యాయాన్ని వ్యక్తిగత సమస్యగా కాకుండా సామాన్య ప్రజల హక్కుల సమస్యగా భావించి పోరాడిన ఐలమ్మ జీవితం సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. మహిళలు కూడా సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నించగలరని, తమ హక్కుల కోసం ధైర్యంగా పోరాడగలరని ఐలమ్మ తన జీవితంతో చాటిచెప్పారని పేర్కొన్నారు.

ఐలమ్మ ఆశయాలను నేటి తరానికి పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ సామాజిక సమానత్వం, మహిళల ఆత్మగౌరవం, పేదల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. కిషన్, మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, రాజపల్లి సర్పంచ్ కట్టుకూరి మల్లారెడ్డి, కౌన్సిలర్లు భారతి, పుణ్యలత, సొల్లు సునీత, మొగిలి, సమ్మయ్య, బండ సింధుజ, బండ నరేష్, శ్రీనివాస్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, రజక సంఘం నాయకుడు కొలిపాక శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మేకల తిరుపతి, మాజీ కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ మహిళా పట్టణ అధ్యక్షురాలు వేముల పుష్పలత, రామారపు రాధ, భూలక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు వేల్పుల రత్నం, జనార్ధన్, కాంగ్రెస్ నాయకులు సొల్లు బాబు, కోయల్కర్ బాలాజీ, ఉప్పు శ్రీనివాస్, సుంకరి రాజమౌళి, మున్సిపల్ జవాన్ ప్రతాపరాజు, కొలిపాక రమేష్, రామారావు లక్ష్మణ్‌తో పాటు రజక సంఘం నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాపై కొత్త నిర్ణయాలు

- **ఇంటి వద్దకే అధికారులు సేవలు**
- **విచారణలకు సులభతరం చేసిన ఏర్పాట్లు**
- **నిరాశ్రయులు, కార్మికులకు ప్రత్యేక శిబిరాలు**
- **కొత్త ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక చర్యలు**




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ ఎన్నికల సంఘం శనివారం మధ్యాహ్నం నిర్వహించిన కీలక సమావేశంలో ఓటరు జాబితాల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించే అంశాలపై పలు నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక పరిశీలన ప్రక్రియలో గుర్తించిన సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని ఎన్నికల సంఘం పేర్కొంది.

ప్రత్యేక పరిశీలనలో భాగంగా నోటీసులు అందుకున్న వ్యక్తుల విషయంలో ఇకపై క్షేత్రస్థాయిలోనే చర్యలు చేపట్టనున్నారు. సంబంధిత అధికారులు నేరుగా వారి ఇళ్లకు వెళ్లి అవసరమైన పత్రాలను సేకరించి వ్యవస్థలో నమోదు చేస్తారు. అనంతరం ఎన్నికల నమోదు అధికారుల పరిశీలనకు పంపిస్తారు. దీంతో సాధారణ ప్రజలు కార్యాలయాలకు వెళ్లి హాజరు కావాల్సిన అవసరం తగ్గనుంది. అత్యవసర పరిస్థితులు మినహా వ్యక్తిగత విచారణలను కార్యాలయాల్లో నిర్వహించకుండా సాధ్యమైనంత వరకు అంతర్జాలం ద్వారా నిర్వహించాలని నిర్ణయించారు. అవసరమైతే ఓటరు తరపున కుటుంబంలోని ఏదైనా పెద్ద సభ్యుడు హాజరయ్యే అవకాశాన్ని కూడా కల్పించారు. ఇందుకోసం అంతర్జాల సౌకర్యాలను మరింత బలోపేతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రాత్రి ఆశ్రయ కేంద్రాల్లో నివసించే వారు, కూలీలు, పేదలు, నిరాశ్రయులు వంటి వర్గాలు ఓటరు జాబితాలో చేరేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అవసరమైన చోట ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ నమోదు అవకాశాలు కల్పించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎవరూ ఓటరు హక్కుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది.

ప్రత్యేక పరిశీలన ప్రక్రియ ఇప్పటికే బీహార్, పశ్చిమ బెంగాల్‌తో పాటు ఇరవై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పూర్తయిందని ఎన్నికల సంఘం వెల్లడించింది. అయినప్పటికీ ఏదైనా కారణంతో పేరు నమోదు కాకపోయిన వారు లేదా తొలిసారి ఓటు హక్కు పొందిన యువత తమ పేర్లను ఎప్పుడైనా నమోదు చేసుకునే అవకాశం ఉందని స్పష్టం చేసింది. నిరంతర నవీకరణ ప్రక్రియ ద్వారా ఈ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపింది. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. యువ ఓటర్లు, ఇప్పటివరకు నమోదు కాని అర్హులైన పౌరులను గుర్తించి జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడి ఓటు నమోదు కావడం అత్యంత ముఖ్యమని ఎన్నికల సంఘం పేర్కొంది.

# వికసిత్ భారత్ కార్యక్రమంలో సర్పంచ్ అనిత ప్రసంగం



**వేలేరు, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ (జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సమావేశంలో హన్మకొండ జిల్లా సర్పంచ్‌ల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి, పీచర గ్రామ సర్పంచ్ మరిజే అనిత నరసింహారావు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే ప్రతి పనిని సద్వినియోగం చేసుకుని తమ వ్యవసాయ భూముల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం కావచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంపీడీవోలు, ఎంపీఓలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు

# గంట శ్రీనాథ్‌కు ఘన సన్మానం



- **బోర్నపల్లి ముదిరాజ్ సంఘం డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా అభినందనలు**

**హుజురాబాద్, సెప్టెంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి ముదిరాజ్ సంఘం ఎన్నికల్లో డైరెక్టర్‌గా ఎన్నికైన గంట శ్రీనాథ్ ముదిరాజ్‌ను కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యేముల పుష్పలత, ఏఎంసీ డైరెక్టర్ పానుగంటి కిరణ్ రెడ్డి, బీసీ సెల్ అసెంబ్లీ చైర్మన్ కుర్ర శ్రీనివాస్ గౌడ్, జూపాక సమ్మక్క సారలమ్మ చైర్మన్ దాసరి సదానందం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉట్ల రత్నాకర్ రెడ్డి, గంట కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి గంట శ్రీనాథ్ తన వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. సంఘం డైరెక్టర్‌గా ఎన్నికైన ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

గంట శ్రీనాథ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో డైరెక్టర్‌గా ఎన్నుకున్న ముదిరాజ్ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధి, సభ్యుల సమస్యల పరిష్కారం కోసం అందరి సహకారంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

# జల భద్రతపై అంతర్జాతీయ చర్చల ముగింపు

- **నాలుగు రోజులపాటు సదస్సు నిర్వహణ**
- **వాతావరణ అనుకూల జల నిర్వహణపై దృష్టి**
- **న్యూఢిల్లీలో ఘనంగా ముగిసిన సదస్సు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ రాజధాని న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన తొమ్మిదవ భారత అంతర్జాతీయ జల వారోత్సవం ఘనంగా ముగిసింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో దేశ, విదేశాలకు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో జల వనరుల పరిరక్షణ, సమర్థ నిర్వహణ, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే మార్గాలపై ఈ సదస్సులో విస్తృత చర్చలు జరిగాయి. సెప్టెంబర్ 22 నుంచి 25 వరకు నిర్వహించిన ఈ అంతర్జాతీయ కార్యక్రమం "వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన జల నిర్వహణ" అనే అంశంపై కేంద్రీకృతమైంది. వివిధ దేశాల విధాన రూపకర్తలు, ప్రభుత్వ అధికారులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, జల వనరుల నిపుణులు, యువ శాస్త్రవేత్తలు పాల్గొని జల భద్రతకు సంబంధించిన సవాళ్లు, పరిష్కారాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.ముగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న తరుణంలో జల వనరుల సమర్థ వినియోగం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వాలు, నిపుణులు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, యువత ఒకే వేదికపై కలిసి చర్చించేందుకు ఈ సదస్సు అవకాశాన్ని కల్పించిందన్నారు. జల భద్రత సాధనలో భాగస్వామ్య విధానం ఎంతో అవసరమని ఆయన వివరించారు. సదస్సులో భాగంగా రెండో భారత అంతర్జాతీయ పరిశుభ్రత, తాగునీటి సదస్సు కూడా నిర్వహించారు. గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుధ్య సేవల విస్తరణ, ప్రజారోగ్య పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధన వంటి అంశాలపై ప్రత్యేక సమావేశాలు జరిగాయి. వివిధ రాష్ట్రాల అనుభవాలు, విజయవంతమైన నమూనాలను కూడా ప్రతినిధులు ప్రదర్శించారు.

జల వనరుల సంరక్షణలో సాంకేతికత వినియోగం, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ, పట్టణ ప్రాంతాల్లో నీటి నిర్వహణ, వ్యవసాయ రంగంలో నీటి సమర్థ వినియోగం వంటి అంశాలపై నిపుణులు తమ పరిశోధన ఫలితాలను వివరించారు. భవిష్యత్‌లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు వినూత్న పరిష్కారాల అవసరాన్ని నొక్కి చెప్పారు. నాలుగు రోజులపాటు సాగిన ఈ అంతర్జాతీయ సదస్సు జల వనరుల నిర్వహణకు సంబంధించి కొత్త ఆలోచనలు, విధాన సూచనలకు వేదికగా నిలిచింది. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొంటూ జల భద్రత సాధన దిశగా ప్రపంచ దేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ సదస్సు ద్వారా జల వనరుల పరిరక్షణపై మరింత అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

తెలంగాణ ముచ్చట్లు పిలుపుకు విశేష స్పందన

# కూతుళ్లపై తల్లిదండ్రుల ప్రేమ..
# అక్షరాల్లో ఆవిష్కారం!

కూతురు అంటే ఇంటికి వెలుగు.. తల్లిదండ్రుల జీవితంలో ఆనందం.. వారి భవిష్యత్తుకు ఆశ.నేడు డాటర్స్ డే సందర్భంగా కూతుళ్లపై తమకున్న ప్రేమను, అనుబంధాన్ని నాలుగు మాటల్లో పంచుకోవాలంటూ తెలంగాణ ముచ్చట్లు ఇచ్చిన పిలుపుకు తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది.తమ కూతుళ్ల గురించి తల్లిదండ్రులు పంపిన సందేశాలు ప్రేమానురాగాలను ప్రతిబింబించాయి. కొందరు తమ కూతుళ్లను ఇంటి వెలుగుగా అభివర్ణించగా.. మరికొందరు తమ జీవితానికి దక్కిన వరంగా పేర్కొన్నారు. కూతుళ్ల చిన్ననాటి జ్ఞాపకాలు, వారి నవ్వులు, కలలు, విజయాలు, భవిష్యత్తుపై తమ ఆశలను తల్లిదండ్రులు భావోద్వేగంగా పంచుకున్నారు. కూతుళ్లు తమ జీవితాల్లోకి వచ్చిన తర్వాత కుటుంబంలో ఆనందం మరింత పెరిగిందని, వారి భవిష్యత్తు కోసం తాము పడే ప్రతి కష్టం సంతోషమేనని పలువురు తల్లిదండ్రులు పేర్కొన్నారు. కూతుళ్లు ఎంత ఎదిగినా తమకు ఎప్పటికీ చిన్నారులేనని, వారి ప్రతి అడుగులో అండగా ఉంటామని తెలిపారు.కూతురు భారమేమీ కాదు.. కుటుంబానికి వెలుగు, తల్లిదండ్రులకు బలం, భవిష్యత్తుకు ఆశ. కూతుళ్లపై తల్లిదండ్రుల ప్రేమకు అద్దం పట్టేలా తెలంగాణ ముచ్చట్లు పిలుపుకు వచ్చిన స్పందనలు నిలిచాయి. డాటర్స్ డే సందర్భంగా తమ కూతుళ్లపై తల్లిదండ్రులు రాసిన ప్రేమ సందేశాలను తెలంగాణ ముచ్చట్లు ప్రత్యేకంగా అందిస్తోంది. తల్లిదండ్రులు పంపిన కూతుళ్లపై ప్రేమ సందేశాలు..

- తెలంగాణ ముచ్చట్లు, హన్మకొండ,సెప్టెంబర్ 26



## నా కూతురే... నా ప్రపంచం


ఒక అమ్మాయి తాను గర్భవతి అని తెలుసుకున్న క్షణం నుంచి తనలో ఎన్నో కొత్త కలలు మొదలవుతాయి. తన బిడ్డను ఎలా పెంచాలి, ఎలా ముద్దుగా చూసుకోవాలి అంటూ ఎన్నో ఊహలు కంటుంది.
మొదటిసారి కూతురు పుట్టిందని తెలిసిన క్షణంలో... తన ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని సంబరపడుతుంది.
ఆ చిన్నారి తొలిసారి "అమ్మా" అని పిలిచినప్పుడు కలిగే ఆనందం మాటల్లో చెప్పలేనిది. ఆ ఒక్క పిలుపు కోసం తల్లి ఎన్ని కష్టాలనైనా మరిచిపోతుంది. కూతురి చిరునవ్వులో తన ప్రపంచాన్ని చూసుకుంటుంది.
అలాంటి కూతురు ఒక్కసారిగా తనకు దూరమైతే... ఆ తల్లి గుండెల్లో కలిగే బాధను మాటల్లో చెప్పడం అసాధ్యం. ఆ బాధను భరించడం మరణం కంటే ఎక్కువగా అనిపిస్తుంది. అయినా కాలం ముందుకు సాగాల్సిందే... జ్ఞాపకాలు మాత్రం గుండెల్లోనే మిగిలిపోతాయి.
తన కూతురిని కోల్పోయిన ఆ తల్లి... మళ్లీ తన చిన్న కూతురి రూపంలో అదే ప్రేమను, అదే అనుబంధాన్ని చూసుకుంటుంది. ఆ పాపలో తనకు దూరమైన కూతురి జ్ఞాపకాలను వెతుక్కుంటూ, తన జీవితాన్ని ముందుకు తీసుకెళ్తుంది.
ఈ ప్రపంచంలో నా కూతురి కంటే నాకు ఏదీ ఎక్కువ కాదు.
నా కూతురే నా ప్రపంచం... నా ఆశ... నా ఆనందం... నా జీవితం.
ఆమె కోసం ఏదైనా చేయగలను.
నా బంగారం... నా కూతురు...
నువ్వే నా ప్రపంచం.

— నా కూతురు అమూల్యకు ... ప్రేమతో మీ అమ్మ శ్రీలేఖ —



నా కూతురు అంకిత ఉన్నత చదువులు చదివి వైద్యరంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా కల. ఆమెపై నమ్మకంతో, తన కలలను నెరవేర్చుకునేందుకు ఎప్పుడూ అండగా నిలిచాను. ఆమె చదువుకు ఎలాంటి ఆటంకం రాకుండా నా వంతు కష్టాన్ని నేను భరించాను. "నువ్వు చదువుకో.. మిగతాది నేను చూసుకుంటాను" అనే ధైర్యమే ఆమెకు ఇవ్వగలిగిన నా గొప్ప బలం.
అంకిత ప్రభుత్వ వైద్యురాలిగా ఎదిగి పేదలకు సేవ చేయాలని కోరుకుంటోంది. ఆమె పట్టుదల, కష్టపడే తత్వం చూస్తుంటే తండ్రిగా నాకు ఎంతో గర్వంగా ఉంటుంది. నా కూతురు తన లక్ష్యాన్ని చేరుకుని, తన కలలను నిజం చేసుకుని, సమాజానికి సేవ చేస్తూ ఎదగడమే నా జీవితంలో అతిపెద్ద ఆనందం. అంకిత ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించినా, ఆమె వెనుక నాన్నగా నా అండ, ప్రేమ, ఆశీర్వాదం ఎప్పటికీ ఉంటాయి.

- మీ నాన్న ఎల్లస్వామి








"నా కూతుర్లు... నా జీవితంలో దేవుడు రాసిన అత్యంత అందమైన అక్షరాలు."
"నా కూతుర్ల చిరునవ్వే నా ఇంటి వెలుగు...
వారి సంతోషమే నా జీవితపు పండుగ."
"నా కూతుర్ల కలలకు రెక్కలివ్వడం నా బాధ్యత...
వారి విజయాన్ని చూడడం నా జీవిత సార్థకత."
"నా కూతుర్లు నా చేయి పట్టుకుని నడిచిన చిన్నారులు...
నేడు నా జీవితానికి ధైర్యంగా నిలిచే బలాలు."
"నా కూతుర్లు నా రెండు కళ్లే కాదు...
నా పంచప్రాణాలు,
నా ప్రపంచం, నా మరో జన్మ."
కూతుర్లు అందరికీ హృదయపూర్వక కూతుర్ల దినోత్సవ శుభాకాంక్షలు.

ప్రిన్సి,తపస్వి లకు ప్రేమతో ...
మీ నాన్న సోలంకి శ్రావణ్ కుమార్



నా కూతురు మహాలక్ష్మి సాయి శృతి నా జీవితంలో దొరికిన అందమైన వరం. ఆమె నవ్వు నా ఆనందం, ఆమె సంతోషం నా సంతోషం. ఆమె ప్రతి అడుగు ముందుకు వేస్తుంటే ఒక తండ్రిగా నాకు ఎంతో గర్వంగా ఉంటుంది. ఆమె కలలు, ఆశలు నెరవేరాలని కోరుకోవడమే నా జీవితంలోని ఒక ముఖ్యమైన ఆశయం. శృతి ఎంత పెద్దదైనా, ఎంత ఎత్తుకు ఎదిగినా నా కళ్లలో మాత్రం ఎప్పటికీ నా చిన్నారి కూతురే. జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఆమెకు అండగా నిలబడటం, ఆమెకు ధైర్యం ఇవ్వడం నా బాధ్యతగా భావిస్తాను. నా కూతురు నా బలం... నా ఆనందం... నా గర్వం... నా ప్రపంచం.

తండ్రి ప్రేమ కూతురికి జీవితాంతం అండగా నిలిచే నీడలాంటిది. కూతురి నవ్వులో తండ్రి తన ఆనందాన్ని చూసుకుంటాడు. తండ్రి చేతుల్లో కూతురికి ప్రపంచం మొత్తం సురక్షితంగా అనిపిస్తుంది. తండ్రి–కూతురు బంధం మాటలకు అందని మధురమైన అనుబంధం.
హ్యాపీ డాటర్స్ డే ...
ప్రేమతో మీ నాన్న

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





భగవంతుడు మాకు ప్రసాదించిన అమూల్యమైన వరాలు మా ఇద్దరు కుమార్తెలు

మా ఇద్దరు కుమార్తెలు విద్య వినయ శాంతి ప్రజ్ఞ శ్రీ మరియు వాణి వికాస సాయి శ్రీ రేష్మిత. వారి జననంతో మా జీవితం ఆనందం, ఆశలు, ఆశయాలతో పరిపూర్ణమైంది. చిన్ననాటి నుంచే వారు క్రమశిక్షణ, కృషి, పట్టుదల మరియు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగారు. వారి మధ్య మూడేళ్ల వయస్సు తేడా ఉన్నప్పటికీ, ఒకరికి ఒకరు తోడుగా నిలుస్తూ విద్యా ప్రస్థానంలో అద్భుత విజయాలను సాధించారు.


ఇంటర్మీడియట్ లో ఇద్దరు 98 శాతం మార్కులు సాధించడమే కాకుండా ప్రతిష్ఠాత్మకమైన ఎన్ఐటీ వరంగల్‌లో ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసి మా కుటుంబానికి గర్వకారణమయ్యారు. మా పెద్ద కుమార్తె ఇంజనీరింగ్ లో గోల్డ్ మెడల్ సాధించి తన అసాధారణ ప్రతిభను చాటుకోగా, ఇద్దరూ తమ ప్రతిభ, కృషితో నేడు హైదరాబాద్‌లోని ప్రముఖ బహుళజాతి సంస్థల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా సేవలందిస్తున్నారు.

తల్లిదండ్రులుగా మేము వారికి అందించిన ప్రేమ, విలువలు, విద్యకు ప్రతిఫలంగా వారు మాపై చూపిన ప్రేమాభిమానాలు మా హృదయాలను కదిలించాయి. 2026 మార్చి 4న మా వివాహ రజతోత్సవ సందర్భంగా హనుమకొండలో ఘనంగా నిర్వహించిన ఆశ్చర్య వేడుక మా జీవితంలో మరపురాని మధుర ఘట్టంగా నిలిచిపోయింది. ఆ వేడుకలో బంధుమిత్రుల సమక్షంలో మమ్మల్ని ఘనంగా సత్కరించి, తమ ప్రేమను కార్యరూపంలో చూపించారు.

అంతేకాకుండా, ఆ వేడుకలో హైదరాబాద్‌లో ఫ్లాట్ మాకు బహుమతిగా అందించి మా ఆనందాన్ని రెట్టింపు చేశారు. అది కేవలం ఒక ఇల్లు మాత్రమే కాదు; వారి ప్రేమ, కృతజ్ఞత, గౌరవం మరియు కుటుంబ బంధాల ప్రతీకగా మా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

నేడు వారి విజయాలను చూస్తూ, తల్లిదండ్రులుగా మా హృదయాలు గర్వంతో నిండిపోతున్నాయి. వారు మరెన్నో శిఖరాలను అధిరోహిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలవాలని, వారి జీవితం ఆనందం, ఆరోగ్యం, విజయాలతో కళకళలాడాలని మనసారా కోరుకుంటున్నాము.

కందగట్ల గణేష్,
ప్రభుత్వ ఉపాధ్యాయుడు మరియు
విజయ, హనుమకొండ.



ఒక తండ్రి ఒక కుమారుడి కడుపు ని
విచారించి తిన్నావా నాన్న అని
అడుగుడుతాడు కానీ ఒక కుమార్తె
మాత్రం తండి ని డాడీ తిన్నావా అని తండ్రి
కడుపు విచారించి ప్రేమగా చూసేది
మాత్రం ఒక కుమార్తె మాత్రమే.......

నా కూతురు ప్రహర్షి కి
ప్రేమతో మీ నాన్న ...ప్రభుదేవ్



ఆడపిల్ల అంటే లక్ష్మి స్వరూపం....

ఆడపిల్ల పుట్టాలంటే అదృష్టం ఉండాలి....

ఆడపిల్ల ఉన్న తల్లిదండ్రులు అందరికీ శుభాకాంక్షలు...

నా కూతురు శేషాల శ్రేయాన్వికకు
ప్రేమతో ...

వాత్సల్య... నా గుండెలో పూసిన పువ్వువి నువ్వు,
నా జీవితంలో దేవుడు రాసిన
అందమైన అక్షరానివి నువ్వు...
నీ నవ్వు చూస్తే నా బాధలన్నీ దూరమవుతాయి,
నీ కలలు నెరవేరితే నా జీవితమే
గెలిచినట్టవుతుంది,
కూతురిగా నువ్వు నాకు దొరికావు...
నాన్నగా నేను అదృష్టవంతుడినయ్యాను!
నా ప్రాణం... నా వాత్సల్యకు
Happy Daughter's Day!

ప్రేమతో మీ నాన్న..

గోవింద సురేష్





## ఇంటికి వెలుగు కూతురు

ఇంటి మహా లక్ష్మి కూతురు
కూతురే ఒక ప్రపంచం
కూతురు మనసు మందారం
మనిషి బంగారం
కూతురు ప్రేమ అంతులేనిది!!

కూతురు అంటే ఆకాశం అంత ప్రేమ
కూతురికి మించిన ప్రేమ మరో
ఒకటి ఏది లేదు
ఈ ప్రపంచంలో
మంచి చెడులకు తోడుండేది
చిరునామా కూతురు!!
సెప్టెంబర్ 27 కూతుళ్లు దినోత్సవం
సందర్భంగా..

రచన:- దేవులపల్లి రమేశ్
కలం : వామిక శ్రీ వర్ష



## మా ఇంటి మహాలక్ష్మి... మా పెద్ద కూతురు దీక్షిత

మా ఇంటి మహాలక్ష్మిగా, మా కుటుంబానికి తొలి సంతోషంగా నిలిచింది మా పెద్ద కూతురు పసునూరి దీక్షిత. మా ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా ముందుగా మా కూతురితోనే ప్రారంభించడం మాకు ఎంతో ఆనందం. ఆమె అడుగుపెట్టినప్పుడల్లా మా ఇంట్లో కొత్త వెలుగు నిండిన అనుభూతి కలుగుతుంది. మా కూతురు మా ఇంటికి కేవలం వారసురాలు మాత్రమే కాదు... మా కుటుంబానికి ప్రేమ, ఆనందం, వెలుగునిచ్చే దేవత.

పసునూరి రాజేంద్రప్రసాద్
డీపీఆర్ఓ,మహబూబాబాద్

ఆమె కేవలం నా కూతురు మాత్రమే కాదు...
ఆమెనే నా జీవితం.

ఆమె నా జీవితంలోకి వచ్చిన తర్వాత, నా భవిష్యత్తుపై మళ్లీ ఒక కొత్త ఆశ కలిగింది.

నేను ఎంత అలసిపోయినా, ఎన్ని సమస్యలు ఎదురైనా... ఆమె ఒక్క చిరునవ్వు చాలు, అన్నీ విలువైనవిగా అనిపిస్తాయి.

ఆమె రాకముందు నేను కేవలం
జీవించేవాడిని...

ఆమె వచ్చిన తర్వాత నా భవిష్యత్తు గురించి కలలు కనడం మొదలుపెట్టాను.

నా చిన్నారి... నా జీవితానికి ఒక కారణాన్ని, ఒక ఆశను, ఒక అందమైన రేపటిని ఇచ్చింది నువ్వే.

నా కూతురు సిరి ప్రియా కు

ప్రేమతో మీ నాన్న వినీల్



నా చిన్నారి ప్రాగ్వి...
నాన్న గుండెల్లో
అందమైన పాటవు

16 నెలల నీ నవ్వే...
నా ప్రపంచానికి
వెలుగువి
నీ చిన్న చిన్న
అడుగుల్లో... నా పెద్ద పెద్ద
కలలున్నాయి
నీ ప్రతి నవ్వు కోసం...
నాన్న జీవితాంతం
నీతోనే ఉంటాడు
నువ్వు నా కూతురు
మాత్రమే కాదు...
నా ప్రాణం, నా ప్రపంచం,
నా సంతోషం





డాటర్స్ డే శుభాకాంక్షలు
మా కూతురు సుహానా (రుహీ)మా ఇంటికి వెలుగు తెచ్చిన మహాలక్ష్మి, కూతురు అంటే ప్రతి ఇంటికి వచ్చిన దేవత లాంటిది ఆమె నవ్వు ఇంటికి ఆనందాన్ని తెస్తుంది, ఆమె మాటలు మనసుకు ఓదార్పునిస్తాయి. తండ్రికి కూతురు ఎప్పటికీ చిన్న పాపే, కూతురు ఉన్న ఇల్లు నిజంగా అదృష్టవంతమైన ఇల్లు."
మీ నాన్న... మహమ్మద్ సయ్యద్



నాన్నకు కూతురే ఓ ప్రత్యేక ప్రపంచం
కూతురు పుట్టిన రోజు నుంచి నాన్న జీవితంలో కొత్త ఆనందం మొదలవుతుంది. ఆమె నవ్వు నాన్నకు సంతోషం.. ఆమె విజయం నాన్నకు గర్వకారణం. కూతురు ఎంత పెద్దదైనా నాన్న కళ్లలో మాత్రం ఎప్పటికీ చిన్న పాపగానే ఉంటుంది. ప్రేమ, ఆప్యాయత, ధైర్యంతో కూతురికి అండగా నిలిచే నాన్న-కూతురు బంధం ఎంతో ప్రత్యేకమైనది. డాటర్స్ డే సందర్భంగా ఈ అందమైన అనుబంధానికి ప్రత్యేక వందనం.
జూపక రాజు, రిహాన్వి



నా జీవితంలో దేవుడిచ్చిన అందమైన బహుమానం నా కూతురు నా ముఖంలో చిరునవ్వు కు కారణం నా చిక్కి తల్లి నాన్న కూతురు బంధం మాటల్లో చెప్పలేనిది నేను మా ఫ్యామిలీ తో హైదరాబాద్ కు వెళ్ళినప్పుడు అక్కడ బట్టల షాప్ కు వెళ్ళాం నా కూతురు తనకు ఇష్టం పడ్డ డ్రెస్ వేసుకొని వచ్చింది ఈ సంఘటన మర్చిపోలేనిది
నా కూతురు పేరు గాదె విద్య శ్రీ
అమ్మానాన్న ...గాదె లావణ్య వంశీ

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



నా గుండెల్లో నా కూతురికి ఉండే స్థానం ఎప్పటికీ ప్రత్యేకమే...

ఆమె నవ్వు నాకు చెప్పలేనంత సంతోషం..

ఆమె కళ్లలో కన్నీరు వస్తే నా గుండె బరువెక్కుతుంది..

కూతురు తండ్రికి కేవలం కుమార్తె కాదు...

జీవితాంతం ప్రేమించుకునే చిన్నారి,

గర్వంగా చెప్పకునే గొప్ప బంధం.

ప్రతి కూతురికి హృదయపూర్వక డాటర్స్ డే శుభాకాంక్షలు!



నా కూతురు ఆరుషి...

నా జీవితానికి అర్థం ఇచ్చిన అమూల్యమైన బంధం. ఆమె నవ్వు నా ఆనందం, ఆమె సంతోషం నా సంతోషం.

ఆమె నా బలం.
ఆమె నా సర్వస్వం.
ఆమె కలలు నెరవేరే ప్రతి అడుగులో నా ప్రేమ, ఆశీర్వాదం ఎప్పుడూ ఆమెతోనే ఉంటాయి.



కూతురు అంటే... నాన్న గుండెల్లో దాచుకున్న ఒక చిన్న ప్రపంచం...

ఆమె నవ్వు నాన్న జీవితానికి వెలుగునిచ్చే క్షణం...
ఆమె సంతోషం కోసం నాన్న ఎన్ని కష్టాలనైనా భరిస్తాడు...
ఆమె కలల కోసం తన కలలను కూడా పక్కన పెడతాడు...
ఆమె ఎంత పెద్దదైనా, నాన్న కళ్లలో మాత్రం ఎప్పటికీ చిన్న పాపే...

లాస్య...సిరి...
మీరిద్దరూ నా కూతుళ్లు మాత్రమే కాదు...
నా బలం...నా ఆనందం...
నా గుండెల్లో దాచుకున్న రెండు అందమైన ప్రపంచాలు.

మా అమ్మానాన్నలకు ప్రేమతో
ఈ ప్రపంచంలో అత్యంత స్వచ్ఛమైన ప్రేమ ఏదంటే...
అది అమ్మానాన్నల ప్రేమ.
ఆ ప్రేమకు అందమైన రూపమే... కూతురు.
దేవుడు ప్రతి ఇంటికి వరాలు ఇస్తాడు...
మా ఇంటికి మాత్రం మూడు వరాలు ఇచ్చాడు.
మూడు కూతుళ్లు...మూడు నవ్వులు...మూడు ఆశలు...

మొదటి కూతురు నాన్నకు చిన్న ప్రిన్సెస్...
అమ్మకు మంచి స్నేహితురాలు.
మాకు ఏ కష్టం వచ్చినా
మా అమ్మానాన్నలు ఎప్పుడూ మా వెంటే ఉంటారు.
వాళ్ల నమ్మకమే మా బలం.

రెండో కూతురు మా ఇంటి నవ్వుల పువ్వు...
చిన్న చిన్న విషయాల్లోనే ఆనందాన్ని వెతుక్కునే మనసు.
అమ్మానాన్నల ప్రేమే మాకు ధైర్యాన్ని ఇచ్చింది.

మూడో కూతురు మా ఇంటి చిన్నారి...
అందరి ముద్దుల బిడ్డ.
మా తప్పులను కూడా ప్రేమగా అర్థం చేసుకునే
మా అమ్మానాన్నల ప్రేమే



మాకు ప్రపంచంలోనే గొప్ప బహుమతి.

మేము ముగ్గురు కూతుళ్లం...
మూడు శక్తులు... మూడు ఆశలు... మూడు కలలు.

మేము పుట్టిన రోజు నుంచి మా ఇంట్లో ఆనందం పుట్టింది...
మా చిన్న చిన్న అడుగుల్లో మా అమ్మానాన్నల భవిష్యత్తు దాగి ఉంది.

మా అమ్మానాన్నలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడుతూ,
మా జీవితాలను గొప్పగా తీర్చిదిద్దుకుని
వాళ్లకు ఎప్పటికీ గర్వకారణంగా ఉంటాం.

రాధిక .. సరిత.. రవళి
మీ ప్రేమే మా ప్రపంచం...
మీ ఆశీర్వాదమే మా బలం.

- మీ ముగ్గురు కూతుళ్లు
సమ్మయ్య & అమ్మానాన్నల ప్రేమతో



ఆడపిల్ల ఇంటికి భారం కాదు...
ఆ ఇంటికి వెలుగు, ఆనందం, అదృష్టం.


మా కూతురు జవ్వాజి అలేఖ్య...
నీ నవ్వే మా సంతోషం,
నీ ఎదుగుదలే మా గర్వం.

నీ తప్పులను సరిదిద్దుతూ...
నీ విజయాలను మనస్ఫూర్తిగా

అభినందిస్తూ...
ఎల్లప్పుడూ నీకు అండగా ఉండే
నీ అమ్మానాన్నలం మేము.

నువ్వు నిండు నూరేళ్లు
ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటూ...

హ్యాపీ డాటర్స్ డే
మా బంగారు తల్లీ!



భగవంతుడు మాకు ప్రసాదించిన అమూల్యమైన వరాలు
మా ఇద్దరి కూతుర్లు

మా ఇద్దరు కూతుర్లు
అనూహ్య జశ్విక
మీరే నా బలం..
మీరే నా బలహీనత..

మీ చిరునవ్వు చాలు
నా బాధను తరిమేందుకు..
మీ ముద్దుమాటలు
చాలు నా కష్టాన్ని
మరిపించేందుకు...
ఈ జీవితంలో దేవుడిచ్చిన
మరో అమ్మవు నీవే తల్లి.
హ్యాపీ డాటర్స్ డే

ఆపిల్ & క్రితి

మీ నవ్వే మా సంతోషం...
మీ ఆనందమే మా ఆనందం...
మీ కలలే మా కలలు...
మీ విజయమే మా గర్వం.

మీరు మా కుమార్తెలు మాత్రమే కాదు...
మా జీవితానికి అర్థం ఇచ్చిన రెండు అందమైన వరాలు.
మా బలం మీరు...
మా ధైర్యం మీరు...
మా ప్రపంచం మొత్తం మీరే.

మీరు ఎంత పెద్దవాళ్లుగా ఎదిగినా,
మా కళ్లలో మాత్రం ఎప్పటికీ మా చిన్నారులే.

మీరు పడిపోతే చేయి అందిస్తాం...
మీరు అలసిపోతే అండగా నిలుస్తాం...
మీరు గెలిస్తే మీకంటే ఎక్కువగా సంతోషిస్తాం...
మీరు బాధపడితే మా గుండె కూడా బాధపడుతుంది.

మీరు ఎక్కడ ఉన్నా, ఎంత దూరంలో ఉన్నా
మా ప్రేమ, మా ఆశీర్వాదం ఎప్పుడూ మీ వెంటే ఉంటాయి.

ఆపిల్...క్రితి...
మీరు మా జీవితంలో ఉన్నదే మా అదృష్టం.
ఎప్పటికీ మీ అమ్మానాన్నల ప్రేమ మీతోనే.



## కూతురే... ఇంటికి వెలుగు

కూతురు లేని ఇల్లు దీపం లేని గూడు లాంటిది. ఆమె పుట్టిన రోజే తల్లిదండ్రుల జీవితంలో పండుగ రోజు. అమ్మకు ఆప్త నేస్తం, నాన్నకు గుండె బలం కూతురే. ఆమె చిరునవ్వులోనే కుటుంబమంతా సంతోషాన్ని వెతుక్కుంటుంది.నేటి కూతురు కేవలం ఇంటికే పరిమితం కాదు.. చదువులో, ఉద్యోగంలో, ఆకాశంలో.. అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేస్తోంది.కూతురిని ప్రేమగా పెంచుదాం, ధైర్యంగా నిలబెడదాం, ఆమె కలలకు రెక్కలు తొడుగుదాం. ఎందుకంటే కూతురు ఒక బిడ్డ మాత్రమే కాదు.. భవిష్యత్తుకు భరోసా.

మీ చిట్యాల రమేష్ సీనియర్ జర్నలిస్ట్ .....

సనన్యా ...సహజన్య

"నేను సాధించిన ప్రతి విజయం వెనుక నా బిడ్డల పాదముద్రలే ఉన్నాయి..."

వాళ్లు నా జీవితంలోకి వచ్చిన తర్వాతే
నా కష్టానికి ఒక అర్థం వచ్చింది...
నా కలలకు ఒక గమ్యం దొరికింది...
నా ప్రతి అడుగుకు ఒక కారణం ఏర్పడింది.

వాళ్ల చిన్ననాటి చిరునవ్వులే
నా కష్టాలను మరిపించిన బలమయ్యాయి.
వాళ్ల భవిష్యత్తు బాగుండాలనే ఆశే
నన్ను ప్రతి రోజూ మరింత కష్టపడేలా చేసింది.

నేను సాధించినది ఏదైనా ఉంటే...
అది నా ఒక్కడి విజయం కాదు.
నా వెనుక నిలిచిన నా బిడ్డల ప్రేమ,
వాళ్ల అమాయకమైన నవ్వులు,
వాళ్ల కోసం నేను కన్న కలల విజయం.

నా ప్రతి శ్రమ వాళ్ల కోసం...
నా ప్రతి అడుగు వాళ్ల భవిష్యత్తు కోసం...
నా ప్రతి గెలుపు వాళ్ల సంతోషం కోసం...

వాళ్లు నా బిడ్డలు మాత్రమే కాదు...
నా జీవితానికి అర్థం,
నా ప్రయాణానికి ప్రేరణ,
నా గుండెకు అత్యంత దగ్గరైన ప్రపంచం.

నా ప్రతి శ్వాస...
నా ప్రతి విజయం...
నా ప్రతి ఆనందం...
నా బుజ్జి తల్లులకే అంకితం!



పెళ్లైన ఎనిమిదేళ్లకు మా జీవితంలోకి వచ్చిన నా కూతురు.. పుట్టినప్పటి నుంచి నా ఎదపైన లాలించి పెంచుకుంటున్న నా ప్రాణం. మా నానమ్మ రూపంలో నాకు తల్లిలా దొరికిన ప్రేమకు ప్రతిరూపం.
డాడీ అనే మాట కోసం ఎనిమిదేళ్లు నేను పడిన మౌన వేదనను, మా కన్నీళ్లను, మా బాధను అర్థం చేసుకుని దేవుడు మాకు ఇచ్చిన వరం కాదు... కాదు..
మా కోసం ఆ దేవుడితోనే కొట్లాడి ఈ భూమ్మీదకు వచ్చిన దేవత మా కూతురు.
నా జీవితంలో నేను పొందిన గొప్ప వరం నా కూతురు. ప్రాణం ఉన్నంత వరకు తనకు ఏ కష్టం రాకుండా చూసుకునేలా దేవుడిని ప్రార్థిస్తూ..






"నీ కలలు నీవి.. నీ ప్రయాణం నీది.. కానీ నీ మీద నమ్మకం మాత్రం ఎప్పటికీ నాదే. నువ్వు ఎక్కడికి వెళ్లినా, ఎంత ఎత్తుకు ఎదిగినా.. నీ విజయాన్ని గర్వంగా చూసే మొదటి వ్యక్తి నీ నాన్నే." కూతురిపై నమ్మకం ఉంచిన నాన్న.. ఆమెకు కేవలం తండ్రి కాదు, జీవితాంతం నిలిచే ధైర్యం. కూతురికి ఖరీదైన బహుమతులు ఇవ్వడం కంటే.. ఆమె మాట వినడం, ఆమె కలలను గౌరవించడం, ఆమెకు విద్య అందించడం, ఆమె నిర్ణయాలపై నమ్మకం ఉంచడం తండ్రి ఇచ్చే గొప్ప బహుమతి.
డాటర్స్ డే అందరికి శుభాకాంక్షలు
మీసాల సైదులు, మీసాల అద్వీత శ్రీహన్నిని





కుమార్తెలందరికీ హృదయపూర్వక కుమార్తె దినోత్సవ శుభాకాంక్షలు.
నా కూతురు పుట్టిన రోజే...
నాకు మరో జన్మ పుట్టింది.
ఆమె పుట్టిన క్షణమే ఈ లోకం ఇంత అందంగా ఉంటుందా అనిపించింది.
నా ఇంటి గడప దాటి నా జీవితంలోకి అడుగుపెట్టిన ఆమె...నేడు నా ప్రపంచమంతా తన ప్రేమతో నింపింది.
ఆమె నవ్వులో నా ఆనందం...
ఆమె అడుగుల్లో నా భవిష్యత్తు...
ఆమె నా కూతురు మాత్రమే కాదు...
నా జీవితానికి దేవుడు ప్రసాదించిన అమూల్యమైన వరం.
కర్రె తిరుపతి..
నా ముద్దుల కూతురు... విజ్ఞత్రి



కూతురు అంటే తల్లిదండ్రుల జీవితంలో దేవుడు రాసిన అందమైన ప్రేమకావ్యం.
ఆమె చిరునవ్వు ఇంటికి వెలుగైతే,
ఆమె ఆనందమే తల్లిదండ్రుల నిజమైన సంతోషం.
ఎంత పెద్దదై దూరంగా వెళ్లినా,
తండ్రి గుండెల్లో చిన్న పాపగానే...
తల్లి మనసులో ప్రాణంగా ఎప్పటికీ నిలిచిపోతుంది.
కూతురు ఒక బంధం కాదు...
తల్లిదండ్రుల హృదయంలో చివరి శ్వాస వరకు నిలిచే అమూల్యమైన ప్రేమ.

అధ్వీత శ్రీ ...ప్రదీప్ రావు



కూతురు ఒక బంధం కాదు...
ఒక అందమైన బాధ్యత.
ఆమె నవ్వే ఇంటికి వెలుగు... ఆమె విజయం తల్లిదండ్రులకు గర్వకారణం
నా కూతురు మా ఇంటికి బంగారు మహాలక్ష్మి
అందరికీ హ్యాపీ డాటర్స్ డే!



"తండ్రి కూతురు ప్రేమ బంధం—— మాటల్లో కాకుండా పనుల్లో తెలుస్తుంది. అతని నమ్మకం, ఆమె ధైర్యం——ఒకరినొకరు బలపరుస్తూ ఉంటాయి."
కూతురు సుహానిషకు ప్రేమతో....
మీ...నాన్న ప్రశాంత్ రాజ్



కూతుర్ల దినోత్సవ శుభాకాంక్షలు

మా ప్రేమకు ప్రతిరూపం అన్విక
మా మరపురానికి మధుర క్షణాలకు గుర్తింపు అన్విక
ఆదరన్ని బేధారాన్ని మనస్తత్వానికి గుర్తింపు అన్విక

మీ నాన్న జోగు కుమార్



నా కూతురు నా జీవితంలో వెలుగు నింపిన దేవత. ఆమె చిరునవ్వుతో మా ఇల్లు ప్రతిరోజూ పండగే. మా ఇంట్లో నే కాకుండా మా తమ్ముళ్ళ ఇంట్లో ఏ శుభకార్యమైన నా కూతురు చేతుల్లోనే జరిపిస్తాము. మంచి మనసున్న మా ఇంటి మహాలక్ష్మి.. ఆమె చదువులో, సంస్కారంలో మాకు ఎంతో గర్వకారణం. మా అమ్మాయి గీతిక శర్వాణి కి ప్రపంచ డాటర్స్ డే శుభాకాంక్షలు.

గర్వించే తండ్రి
కన్నెబోయిన రవి యాదవ్,
సీనియర్ జర్నలిస్ట్
స్టేషన్ ఘనపూర్

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in